క్లుప్తంగా

అన్నేకు సత్కారం



పెనమలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అన్నే వేణుగోపాల కృష్ణమూర్తిని పార్టీ నేతలు శుక్రవారం సన్మానించారు. కానూరులో అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి కార్యాలయంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్, తాడిగడప మాజీ సర్పంచి గురుజారవి, వైఎస్సార్ సీపీ నేతలు రామకోటేశ్వరరావు, కర్రా ఆదిశేషారావు, వేమూరి బాలకృష్ణ, మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి అన్వేష్ తదితరులు అన్నేను సత్కరించారు. పార్టీ బలోపేతానికి అన్నేతో కలిసి పని చేస్తామని వారు పేర్కొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



కంకిపాడు: వరద బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో గొడవర్రులోని ఏనుగులకోడు ముంపు బాధిత 30 కుటుంబాలకు శుక్రవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ముంపు సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, నేతలు సుదిమళ్ల రవీంద్ర, కోనేరు భానుప్రసాద్, డీఎన్నార్, తహసీల్దార్ వీ.భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వరద.. పేరుకుపోయిన బురద



రామవరప్పాడు: గత వారం రోజులుగా విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ముంచెత్తిన వరద శుక్రవారం నాటికి తగ్గుముఖం పట్టింది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో మొన్నటి వరకూ ముంపులో ఉన్న రహదారులు పైకి తేలాయి. కాగా ఆయా గ్రామాల్లోని పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామవరప్పాడు ఫ్లైఓవర్ దిగువన రాఘవేంద్ర కాలనీ, ఒడ్రు కాలనీ, అబ్దుల్ కలాం కాలనీలతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో కొంత మేర వరద నీరు తగ్గింది. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ ఆధ్వర్యంలో జేసీబీతో వర్షపునీరు బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టారు. మిగిలిన ప్రాంతాల్లో వరద కారణంగా పేరుకుపోయిన బురదను జేసీబీతో తొలగిస్తున్నారు. అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లిస్తున్నారు.

చిన్నారి శస్త్రచికిత్సకు సాయం



హనుమాన్‌జంక్షన్ రూరల్: పుట్టుకతోనే అరుదైన ఆరోగ్య సమస్యతో జన్మించిన చిన్నారి శస్త్రచికిత్సకు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్ కుమార్ అండగా నిలిచారు. బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన సాదిమెళ్ల రవికుమార్, రాజాకుమారిలకు ఆరు నెలల క్రితం పుట్టుకతో మల ద్వారం లేకుండా కుమారుడు అశ్విన్ జన్మించాడు. చిన్నారి శస్త్రచికిత్సకు సుమారు రూ. 4 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులిద్దరూ కుమిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో పారిశ్రామికవేత్త, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట వెంకట సతీష్‌కుమార్‌ను ఆశ్రయించారు. చిన్నారి పరిస్థితి చూసి చలించిపోయిన ఆయన శస్త్రచికిత్సకు అయ్యే మొత్తం వ్యయాన్ని తానే భరిస్తానని హామీ ఇవ్వడంతో పాటుగా వెంటనే ఆంధ్రా హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ రమణమూర్తితో మాట్లాడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. డాక్టర్ పీవీ రామారావు, డాక్టర్ మేఘన నేతృత్వంలో విజయవంతంగా చిన్నారికి ఆపరేషన్ పూర్తిచేశారు. చిన్నారిని పుట్టగుంట సతీష్‌కుమార్ శుక్రవారం ఆస్పత్రిలో పరామర్శించారు. పుట్టగుంటకు తల్లిదండ్రులు రవికుమార్, రాజాకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకిలో విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్‌ఐ ఉషా తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి గ్రీన్ ఫీల్డ్స్‌కు చెందిన ఎం. వెంకటేశ్వరరావు కుమార్తె కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ రెండవ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని గురువారం ఉదయం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తండ్రి వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.



ఉప్పలూరులో కంకిపాడు-గన్నవరం రోడ్డుపై ప్రవహిస్తున్న బుడమేరు వరద



మంతెనలోని అంతర్గత రహదారుల్లో నిలిచిన బుడమేరు వరదనీరు

తగ్గని బుడమేరు ఉధృతి

- రహదారులు, పంట పొలాల మీదుగా వరదనీటి ప్రవాహం
- ఆందోళనలో పరివాహక ప్రాంత ప్రజలు

కంకిపాడు: ఎగువ నుంచి వరదనీరు బుడమేరులో కలుస్తుండటంతో ఉధృతి తగ్గకుండా ప్రవహిస్తోంది. బుడమేరు పరివాహక ప్రాంతాలైన ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. పలు కాలనీలు, నివాసాలు, పంట పొలాల్లో వరదనీరు చేరింది. ఇళ్లల్లో నుంచి ప్రధాన గ్రామాల్లోకి రావాలంటే ఆయా ప్రాంతాల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే కంకిపాడు–గన్నవరం ప్రధాన రహదారిపై రైల్వే ట్రాక్ సమీపానికి వరదనీరు చేరింది. ఉధృతంగా దిగువకు పరవళ్లు తొక్కుతోంది. దీంతో ఉప్పలూరు వద్ద వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. గన్నవరం వైపు వెళ్లే వాహనాలను ఉప్పలూరు ప్రధాన సెంటరు, వేల్పూరు మీదుగా ఏలూరు రోడ్డు గుండా తరలిస్తున్నారు. తెన్నేరులో వన్నేరు డ్రెయిన్ పొంగిపొర్లుతోంది. పొలాలు కనుచూపు మేర చెరువులను తలపిస్తున్నాయి.



కాసరనేనివారిపాలెం వద్ద కుళ్లిపోయి పాడైన వరి పంట

కుళ్లిపోతున్న పంటలు

వరి, చెరకు, పసుపు, కంద, తమలపాకు, అరటి, కూరగాయ పంటలు నాలుగు రోజులుపైగా నీటి ముంపులో ఉండటంతో ఏ పంట చూసినా కుళ్లిపోతున్నాయి. వరి పంట పాచిపట్టి దెబ్బతింది. మొక్కజొన్న తడిచిపోయి అమ్మకానికి లేకుండా పోయింది. మేత కోసం విక్రయించాల్సిన పరిస్థితికి అవకాశం ఉంటే మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. పంట పొలాల్లో ఉన్న మురుగును బోదెల్లోకి, ఏటిపాయలోకి తరలించేందుకు ఆయిల్ ఇంజిన్లను వినియోగించి పంట సంరక్షణపై రైతులు దృష్టి పెడుతున్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, పురుషోత్తపట్నం, సావరగూడెం గ్రామాల్లో శుక్రవారం వరద ఉధృతి పెరిగింది. గురువారం తగ్గుముఖం పట్టిన వరద ఎగువ నుంచి అధికంగా నీరు వస్తుండటంతో శుక్రవారం మధ్యాహ్నాంకు పెరగడంతో రైతాంగంలో ఆవేదన వ్యక్తం అవుతోంది. బ్రహ్మయ్యలింగం చెరువుకు ఎగువ నుంచి కుంపిణీ వాగు ద్వారా నీరు వస్తుండటంతో కళింగలు పొంగి కొత్తగూడెం, చిక్కవరం, బీబీగూడెం దాటి పురుషోత్తపట్నం, సావరగూడెం గ్రామాలకు వరద ఉధృతి పెరిగిందని రైతులు తెలిపారు.



గన్నవరం-పుట్టగుంట ప్రధాన రహదారిలో ఆముదాలపల్లి వద్ద బుడమేరు ప్రవాహం



మద్దూరు వద్ద వరదనీటిలో పసుపు పంట

పునరావాస కేంద్రాల్లోనే నిర్వాసితులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేరు వరద ఉధృతితో బాపులపాడు మండలంలోని పలు గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మండలంలోని రామన్నగూడెం, ఆరుగొలను, రంగయ్య అప్పారావు పేట, ఓగిరాల, సిరివాడ, కురిపిరాల గ్రామాలు నీట మునగడంతో ప్రభుత్వం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. మండలంలోని ఎనిమిది పునరావాస కేంద్రాల్లో దాదాపు 1,550 మంది నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్నారు. ఆయా కేంద్రాల్లో దాతల సాయంతో నిర్వాసితులకు అధికారులు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు వీరవల్లి, సింగన్నగూడెం, రంగన్నగూడెం, వేలేరు గ్రామాల్లో చెరువులు పూర్తి స్థాయిలో నీటి మట్టంతో నిండుకున్నాయి. చెరువులకు గండి పడకుండా పంచాయతీ, ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఉంగుటూరు: మండలంలో బుడమేరు, వన్నేరు వాగుల వరద ప్రవాహం తగ్గినప్పటికి ఇంకా వెల్దిపాడు, కొయ్యగూరపాడు గ్రామాలకు ఉన్న రెండు వైపుల రహదారులపై నీరు ప్రవహిస్తుంది. స్వచ్ఛంద సంస్థల సహకారంతో అధికారులు జేసీబీ, ట్రాక్టర్‌లపైన ఆయా గ్రామాలకు వెళ్లి ఆహారం అందజేస్తున్నారు. మండలంలో పెద్ద అవుటపల్లి 240, ఆత్కూరు 225, కొయ్యగూరపాడు 237, ఆముదాలపల్లి 200, తరిగోప్పుల 47, వేంపాడు46, వెంకట్రామపురం 30 మంది గ్రామాల్లో వరద ముంపు వాసులు పునరావాస కేంద్రాల్లో ఉన్నారు. తహసీల్దార్ విమల కుమారి, డీటీ శ్రీలత, ఎంపీడీవో శేషగిరిరావు, ఈఓఆర్డీ అమీర్ బాషా గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నారు. పీహెచ్‌సీల డాక్టర్లు సిబ్బందితో కలిసి వైద్య సేవలు అందిస్తున్నారు.



కానుమోలులోని పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

నున్న(విజయవాడరూరల్): వరద నీరు అంబాపురం గ్రామాన్ని ముంచేయగా నున్న జెడ్పీ హైస్కూల్‌లో అధికారులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఒకటవ వార్డులో 1,800 మంది ఉండగా అందరూ వరదల్లో బయటకు రాలేక తాగునీరు, తినడానికి తిండిలేక అల్లాడుతున్నారు. అయితే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో పడవల్లో సహాయం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఇంతవరకు ఒక్క పడవ వచ్చిన పాపానపోలేదు. ఒకటవ వార్డులోని వారిని కనీసం పదిమందిని కూడా పునరావాస కేంద్రానికి తీసుకొచ్చినట్టు లేరు. ప్రస్తుతం అక్కడ ఇద్దరు మాత్రమే ఉండగా ప్రభుత్వ లెక్కల ప్రకారం వంద మంది బాధితులు ఉంటున్నట్లు చెబుతున్నారు.

వరద బాధితులకు చేయూత



నిత్యావసరాల పంపిణీ వాహనం వద్ద ప్రజాప్రతినిధులు, దాతలు



ఆహారం, వాటర్ బాటిల్స్‌తో వెళ్తున్న వాహనాలను ప్రారంభిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ నేతలు

కంకిపాడు: వరద బాధితులకు ఈడుపుగల్లు నందమూరివారి శ్రీ సీతారామా గార్డెన్స్ చేయూత అందించింది. బాధితుల సహాయార్థం పెనమలూరు మండలం పెద పులిపాక గ్రామంలోని 2 వేల కుటుంబాలకు రూ. 6 లక్షల విలువైన నిత్యావసరాలను ఈడుపుగల్లు నుంచి శుక్రవారం తరలించారు. పంపిణీ వాహనాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో నందమూరి విష్ణువర్ధన్‌రావు కుమారులు సౌగంధ్‌కృష్ణ, సౌరభ్‌కృష్ణ, అత్తోట వెంకటేశ్వర్లు (చెన్నై), నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, దేవినేని రాజా, అనుమోలు వెంకటరత్నం, నందమూరి వెంకటమాధవరావు పాల్గొన్నారు.

గన్నవరం: బుడమేరు కాలువ వరద నీటి ముంపులో చిక్కుకున్న ఉంగుటూరు మండలంలోని ప్రజలకు అండగా నిలిచేందుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ శాఖ ముందుకు వచ్చింది. జలదిగ్బంధంలోని ముక్కపాడు, వెల్దిపాడు, ఎలుకపాడు, ఆముదాలపల్లికి ఆహారం, కొయ్యగూరపాడుకు తాగునీటిని అందించి మానవత్వం చాటుకుంది. తొలుత గన్నవరం నుంచి 1,200 వెజిటబుల్ బిర్యాని, వెయ్యికి పైగా వాటర్ బాటిల్స్‌తో బయలుదేరిన వాహనాలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు బిల్డర్స్ అసోసియేషన్ ద్వారా తమవంతు తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు సింగ్‌నగర్, ఉంగుటూరు మండలంలో పాల ప్యాకెట్లు, ఆహారం, తాగునీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ నేతలు తుమ్మల వెంకటేశ్వరరావు, ఎంఎస్ఆర్ కృష్ణ(తణుకు), ఎం.కోటేశ్వరరావు, తుమ్మల జగదీష్, బీ రాఘవరావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పుర ప్రముఖులు గూడపాటి తులసీమోహన్, జాస్తి ఫణిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: వరద బాధితుల సహాయార్థం గొల్లనపల్లికి చెందిన దైవ స్వరూపి ప్రార్థనా మందిరం పాస్టర్ కె.యెహోషువ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేశారు. సంఘస్తులు గడచిన మూడు రోజులుగా భోజనం, మంచినీళ్లు, పాలు, బ్రెడ్, దోమల చక్రాలు అందజేస్తున్నారు. పాస్టర్ వితరణను గ్రామస్తులు అభినందించారు.

- మండలంలోని చిక్కవరం గ్రామంలో శుక్రవారం వరద బాధిత 8 కుటుంబాలకు గ్రామ సర్పంచ్ అన్నే లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చీమలవాగు పొంగి గ్రామంలోకి రావడంతో నిరాశ్రయులైన కుటుంబాలకు నిత్యావసరాలు అందజేసినట్లు సచివాలయం కార్యదర్శి రామెళ్ల రాజేష్ తెలిపారు. ముక్కామల రామచంద్రరావు, దేవూరి శివరామకృష్ణ, చిట్టినేని జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంటల నష్టంపై సర్వే



పోరంకిలో నీట మునిగిన వరి పంట వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

పెనమలూరు: మండల పరిధిలో భారీ వర్షాలు, కృష్ణానది వరద కారణంగా ముంపునకు గురైన పంటల వివరాల నమోదును శుక్రవారం నుంచి చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టంపై గ్రామ స్థాయిలో ఎన్యూమరేషన్ చేస్తున్నారు. వరి, చెరకు, మినుము, మొక్కజొన్న, అరటి, కంద, పసుపు, కూరగాయలు వంటి పలు పంటలు నీట మునిగాయి. ప్రధానంగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఉన్న పంటలు తుడిచి పెట్టుపోయాయి. వణుకూరు, కానూరు, పోరంకి ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పంటలు నాశనమయ్యాయి. కాగా ఆయా గ్రామాల్లో పంట నష్టం వివరాలను వీఏఏ, వీఆర్వోలు నమోదు చేపట్టారు. ఈనెల 10వ తేదీ వరకు నీట మునిగిన పంటలు పరిశీలించి నష్టం వివరాలు నమోదు చేయనున్నారు. రైతులు వారి పంటల వివరాలు ఎన్యూమరేషన్ చేస్తున్న సిబ్బందికి తెలపాలని ఏఓ కనకమేడల శైలజ సూచించారు.

నున్న-విజయవాడ రూటు మారింది



నున్న రోడ్డులో వరద ప్రవాహం

నున్న(విజయవాడరూరల్): వరదల నేపథ్యంలో గత ఆరు రోజులుగా విజయవాడ నుంచి నున్న గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విజయవాడ నుంచి నున్న గ్రామం రావాలంటే.. గన్నవరం వచ్చి అక్కడ నుంచి నేషనల్ బైపాస్ రోడ్డు ద్వారా నున్న గ్రామం చేరడమే ఏకైక మార్గం. నున్న నుంచి పాతపాడు, విలేజి కండ్రిక, పి.నైనవరం, అంబాపురం గ్రామాలకు వెళ్లడానికి అనుకూలంగా ఉంది. శుక్రవారం కూడా విజయవాడ–నున్న రోడ్డులో నాలుగు అడుగుల మేర బుడమేరు వరద ప్రవాహం కొనసాగడంతో మరో మూడు రోజుల పాటు రాకపోకలు జరిగే పరిస్థితి కనిపించడంలేదు. మామూలు రోజుల్లో విజయవాడ నుంచి నున్న గ్రామానికి కేవలం 10 కిలో మీటర్ల దూరంలో ఉండే ప్రయాణం నేడు 25 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. నున్న నుంచి పాయకాపురం, ప్రకాష్‌నగర వెళ్లవలసిన వారు ట్రాక్టర్‌పై వెళుతున్నారు.

వినాయక మట్టి విగ్రహాల పంపిణీ



విద్యార్థినులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో శుక్రవారం విద్యార్థులకు వినాయకుడి మట్టి విగ్రహాలను ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి విగ్రహాలు తయారు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం తగ్గిండానికి మట్టి వినాయకుడి విగ్రహాలు వాడాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసే విగ్రహాలతో కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కాలేజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవిచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి

ఉంగుటూరు: ఎటువంటి వివాదాలకు తావులేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆత్కూరు ఎస్ఐ చావ సురేష్ సూచించారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో వినాయక మండపాలు ఏర్పాటు చేయబోతున్న విగ్రహ కమిటీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విగ్రహం ఏర్పాటు చేసిన దగ్గర నుంచి నిమజ్జనం వరకు కమిటీ వారు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎటువంటి అశ్లీల నృత్యాలను నిర్వహించకూడదని, పెద్ద శబ్దాలతో డీజే బాక్సులు, ట్రాఫిక్‌కు అంతరాయం వంటివి చేయవద్దన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధం



పోరంకిలో మట్టి వినాయక విగ్రహాలు

పెనమలూరు: వినాయక చవితి పండుగ సందడి పల్లెల్లో మొదలైంది. గ్రామాల కూడళ్లలో శుక్రవారం ఉదయం నుంచి పూజా సామగ్రి, పత్రి అమ్మకాలు ప్రారంభించారు. పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో చేసుకోవడానికి భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే వినాయకుడి పందిళ్లు ఏర్పాటు చేయడానికి మండల పరిధిలో అధికారులకు ఆన్‌లైన్‌లో దాదాపు 145 దరఖాస్తులు అందాయి. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున పందిళ్లు వేశారు. వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసి అలంకరిస్తున్నారు.

పూజా సామగ్రి విక్రయాలు

మండల పరిధిలో యనమలకుదురు, కామయ్యతోపు సెంటర్, తాడిగడప జంక్షన్, పోరంకి, పెనమలూరు, గోసాల సెంటర్లలో వినాయకుడి పూజా సామగ్రి, పత్రి విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మట్టి వినాయకుడి విగ్రహాలకు భక్తులు మొగ్గు చూపుతున్నారు. పూలు, పండ్లు, కొబ్బరికాయలు, స్వీట్లకు మంచి డిమాండ్ ఏర్పడటంతో ధరలు మండుతున్నాయి. చవితి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.



కంకిపాడు సెంటరులో పూజా సామగ్రి విక్రయాలు

కంకిపాడు: మండలంలో చవితి సందడి నెలకొంది. శనివారం వినాయక చవితి కావడంతో కంకిపాడు పరిసర ప్రాంతాల్లో సిద్ధమైన గణనాథుడి విగ్రహాలను భక్తులు కొనుగోలు చేశారు. భారీ గణనాథుడి విగ్రహాలను వ్యాన్‌లు, ట్రాక్టర్లలో గ్రామాలకు తరలించారు. మరోవైపు ప్రత్యేక పూజలు చేసేందుకు వినియోగించే పత్రి, పువ్వుల విక్రయాలతో కంకిపాడు ప్రధాన సెంటరు కొనుగోలుదారులతో కళకళలాడింది.